

బీఆర్ఎస్ నాయకుడి అరెస్ట్, రిమాండ్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణానికి బీఆర్ఎస్ నాయకుడు అగ్గి రాములును గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ అసైన్డ్ భూముల వ్యవహారంలో అగ్గి రాములును అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. అనంతరం రాత్రి 11.30 గంటలకు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఇటీవలనే ఓ బీఆర్ఎస్ నాయకుడిని అరెస్ట్ చేసిన వారంలో నే మరొకరిని అదుపులోకి తీసుకోవడంతో సిరిసిల్లలో చర్చ నీయాంశమైంది. వీరు సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అనుచరులు కావడం గమనార్హం.

న్యూస్ బాక్స్

24న 'దిశ' సమావేశం

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు సంబంధించిన జిల్లాల అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశాన్ని ఈ నెల 24న కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ సమావేశానికి చైర్మన్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో పాటు రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సంబంధించిన జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని డీఆర్‌డీవో కోరారు.

జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 10.4 డిగ్రీలు

సిరిసిల్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. గురువారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 10.4 డిగ్రీలు నమోదు కాగా గరిష్ఠ ఉష్ణోగ్రత 32.8 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో గంభీరావుపేటలో 10.4, రుద్రంగిలో 10.8, వీర్నపల్లిలో 11.7, చందుర్తిలో 12.1, బోయినపల్లి, వేములవాడ రూరల్‌లో 12.3, తంగళ్లపల్లిలో 12.4, ముస్తాబాద్‌లో 12.5, వేములవాడ 12.3, కోనరావుపేటలో 12.9, సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేటలో 13.2 డిగ్రీలు నమోదైంది.

నేడు డయల్ యువర్ డీఎం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 12 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిరిసిల్ల పట్టణంతో పాటు ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల ప్రజలు డయల్ యువర్ డీఎం కార్య క్రమంలో పాల్గొని సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 9063403773కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

సిరిసిల్ల బల్దియాలో డిజిటల్ సర్వే షురూ



డిజిటల్ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 స్కీంలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ద్వారా సిరిసిల్ల బల్దియాలో నూతన మాస్టర్ ప్లాన్ కోసం డిజిటల్ డ్రోన్ సర్వే ప్రారంభం అయ్యింది. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బతుకమ్మ ఘాట్ వద్ద డిజిటల్ డ్రోన్ సర్వేను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ప్రారంభించారు. సిరిసిల్ల పట్టణం, విలీన గ్రామాల్లో గుర్తించిన వివిధ లోకేషన్ పాయింట్లలో డిజిటల్ డ్రోన్ సర్వేను నిర్వహించనున్నారు. భవిష్యత్తులో పట్టణాభివృద్ధికి దోహదపడే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, దార్నం అరుణ, బోల్గం నాగరాజు, రేడ్యానాయక్, పత్తిపాక పద్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయి



హ్యాండ్ బాల్ పోటీల్లో తలబడుతున్న జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం అన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలో సీఎం కప్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, నెట్‌బాల్ పోటీలను జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడారు. ప్రతీ రోజు కనీసం అరగంట పాటు ఎంచుకున్న క్రీడల్లో సాధన చేయాలన్నారు. క్రీడాపోటీల్లో గెలుపోములు సహజమన్నారు. ఓడినా గెలిచినా క్రీడాకారులు రెండింటిని సమానంగా చూడాలన్నారు. క్రీడాపోటీలు స్నేహపూర్వకంగా జరగాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి, కబడ్డీ మండల అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేనా?

- రూ. రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతుల ఎదురుచూపులు
- మాఫీ కోసం దరఖాస్తులు
- పకడ్బందీగా రుణమాఫీ ప్రక్రియ
- నాలుగో విడతలో 3,352 మంది రైతులకు రూ 28.72 కోట్లు





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల మేరకు రైతులకు రుణమాఫీ ప్రక్రియ చేపట్టారు. దానికి అనుగుణంగానే 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 10వ తేదీ వరకు రుణాలు తీసుకున్న వారికి మాఫీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో 61, 234 మంది రైతులు రూ. 702.36 కోట్ల రుణాలను పొందారు. ఇందులో అర్హులకు సంబంధించి రెండు లక్షల మేరకు ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ పకడ్బందీగా చేపట్టింది. తాజాగా జిల్లాలో ఇంకా దాదాపు 20 నుంచి 30 శాతం వరకు రెండు లక్షలకు పైగా రుణాలు పొంది మాఫీ కోసం ఎదురు చూస్తున్నవారు ఉన్నారు. తమకు రుణమాఫీ వర్తింపజేయాలని రెండు లక్షలకు పైగా రుణం తీసు కున్న రైతులు దరఖాస్తులు చేసుకుంటూ రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రెండు లక్షలకు పైగా రుణ మాఫీకానీ వారిలో సన్న, చిన్నకారు రైతులున్నారు. రెండు లక్షలకు పైగా ఉన్న అప్పును చెల్లిస్తే రుణమాఫీ అవుతుందని రైతులు మిగతా డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. రుణమాఫీ కోసం చూస్తు న్నా ఐదో జాబితా సిద్ధం చేస్తారా లేదా అనే దానిపై సందిగ్ధంతో ఉన్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్‌తో రైతులు రుణమాఫీ చేయడంవల్ల కూడా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 374.87 కోట్లు మాఫీ

జిల్లాలో రుణమాఫీకి సంబంధించి వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు పకడ్బందీగా వివరాలు సేకరించారు. జిల్లాలో మూడు విడతల్లో 43,770 మంది రైతులకు రుణమాఫీ రూ 346.15 కోట్లు పూర్తి చేశారు. రుణమాఫీ ప్రక్రియ లో సాంకేతిక కారణాలు, బ్యాంక్ ఖాతాల్లో తేడా లు వంటి అంశాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ అందలేదు. ఈ క్రమంలోనే మళ్లీ నాలుగో విడతలో 3,357 మంది రైతులకు రూ 28.72 కోట్లు విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 47,127 మంది రైతులకు రూ 374.87 కోట్లు రుణమాఫీ జరిగింది. ఇందులో మొదటి విడతలో 23,785 మంది రైతులకు రూ 135.35 కోట్లు, రెండో విడతలో 12,202 మంది రైతులకు రూ 117.76 కోట్లు, మూడో విడతలో 7,783 మంది రైతులకు రూ 93.04 కోట్లు రుణమాఫీ చేశారు. రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తింపజేయాలని వస్తున్న డిమాండ్ మేరకు ప్రత్యేక ఫార్మట్ ద్వారా వివరాలను సేకరించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

- రజిత, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్



ఇంటర్వ్యూ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయని, ఇప్పటి వరకు రూ. 488.77 విలువైన ధాన్యం సేకరించామని, రైతుల ఖాతాల్లో రూ 478.34 కోట్లు జమ చేశామని పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ రజిత 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి?

మేనేజర్: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుంది. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాము.

ఆంధ్రజ్యోతి: ఎన్ని కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేపట్టారు?

మేనేజర్: జిల్లాలో ధాన్యం 248 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. ముందుగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులకు అవగాహన కల్పించాం. 255 గ్రామ పంచాయతీల పరిధిలో ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 193, డీసీఎంఎస్ ద్వారా ఆరు, మెప్మా ద్వారా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టాం. ఇప్పటికే 242 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేశాం. ఐకేపీకి సంబంధించి 44 కేంద్రాలు, డీసీఎంఎస్ ఆరు, మెప్మా నాలుగు, సింగిల్ విండోలో 188 కేంద్రాలు మూసివేశాం, సింగిల్ విండోల ద్వారా కొనుగోళ్లు నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎంత ధాన్యం సేకరించారు?

మేనేజర్: జిల్లాలో పౌరసరఫరాల శాఖ ద్వారా 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 247 కేంద్రాల ద్వారా 36,377 మంది రైతుల నుంచి 2,10,675 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం.

ఆంధ్రజ్యోతి: రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అవుతున్నాయా?

మేనేజర్: ధాన్యం కొనుగోలు చేసి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేసిన తరువాత రైతులు ఖాతాల్లో వెంటవెంటనే డబ్బులు జమ అవుతున్నాయి. జిల్లాలో 36,377 రైతుల నుంచి 488.77 కోట్ల విలువైన ధాన్యం సేకరించాం. ఇందులో ఇప్పటి వరకు 36,192 మంది రైతుల ఖాతాల్లో రూ. 478.34 కోట్లు జమ చేశాము.

ఆంధ్రజ్యోతి: సన్నరకం ధాన్యం సేకరణ ఎలా జరిగింది?

మేనేజర్: జిల్లాలో సన్నరకానికి సంబంధించి ధాన్యం సేకరణ పూర్తి చేశాం. 6,005 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఇందులో ఐకేపీ ద్వారా 1,228 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 4,057 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 508 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 211 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం.

ఆంధ్రజ్యోతి: సీఎంఆర్ ఎలా జరుగుతుంది?

మేనేజర్: జిల్లాలో రైస్‌మిల్లులు అందించే కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో 2023-24 వానాకాలం, యాసంగికి సంబంధించి 72,460 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఇందులో వానాకాలం సంబంధించి 1,34,983 మెట్రిక్ టన్నులకు గాను 1,30,307 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు అందించారు. 4,647 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. యాసంగికి సంబంధించి 1,74,313 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 1,06,529 మెట్రిక్ టన్నుల ధాన్యం అందించారు. 67,784 మెట్రిక్‌టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. సీఎంఆర్ అందించే విధంగా వేగవంతం చేస్తున్నాం.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్



గ్రంథాలయ పరిసరాలను పరిశీలిస్తున్న సత్యనారాయణ గౌడ్

చందుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గ్రంథాలయ భవనం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రంథాలయ సిబ్బందికి సూచించారు. గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమై మొదటిసారిగా చందుర్తికి వచ్చిన సత్యనారాయణగౌడ్‌ను మండల కాంగ్రెస్ నా యకులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీ సీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, కాంగ్రెస్ నాయకులు, ఉన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, అగ్రహారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన పట్టికను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం భోజనం వడ్డించాలని అన్నారు. నాణ్యత లేకుండా భోజనం అందించకూడదని అన్నారు. ఆహార పదార్థాలు నిల్వ చేసే ప్రాంతాలు, వంట చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అనూష అన్నారు. ఆమె వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

గంభీరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు దుస్తులు ఇవ్వడం లేదంటూ పారిశుధ్య కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. గంభీరావుపేట గ్రామ పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులు, ఇతర సామగ్రి ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. ఎన్నిసార్లు అడిగిన తమను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మణ్‌ను అడగగా, ఆగస్టులో గంభీరావుపేట ఈవోగా లేనని ఈ సమస్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు.

పవర్‌లూమ్ వర్కర్ల మెరుపు సమ్మె విజయవంతం



సిరిసిల్ల చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న కార్మికులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూలి పెంచాలంటూ సిరిసిల్లలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్కరోజు మెరుపు సమ్మె గురువారం విజయవంతం అయింది. సిరిసిల్లలో ప్రభుత్వం టెస్కో ద్వారా ఉత్పత్తి చేస్తున్న ఆర్వీఎం, పీసీ, ఇతర ప్రభుత్వ వస్త్రాలను తయారు చేస్తున్న వస్త్రపరిశ్రమలతోపాటు అనుబంధరంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కూలీ పెంచాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు.

సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేసి చేనేత జౌళిశాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వస్త్రాలను తయారుచేసే కార్మికులతోపాటు అనుబంధంగా ఉన్న వైపని, వార్పిన్ కార్మికులకు కూలి పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే పనులను బంద్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆర్వీఎం వస్త్రాలకు సంబంధించి షర్టింగ్ తయారుచేసే మరమగ్గాల కార్మికులకు ఒక మీటర్‌కు మూడు రూపాయలు చెల్లించడంతోపాటు షూటింగ్ వస్త్రానికి మీటర్‌కు రూ 3.50 పైసలు చెల్లించా లన్నారు. వైపని కార్మికులకు ఆర్వీఎం, పీసీ షర్టింగ్ షూటింగ్ బీముల వెయ్యి పోగులకు రూ 130 చెల్లించాలన్నారు. 2023 సంవత్సరానికి రావాల్సిన యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అంతే కాకుండా వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని, పవర్‌లూం, అనుబంధ రంగాల కార్మికులకు నిరంతరం ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. పాలిస్టర్ వస్త్రానికి కూలిని తగ్గించకుండా కార్మికులకు ఒప్పందం ప్రకారం కూలిని చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, మాల్లారపు అరుణ్‌కుమార్, నక్క దేవదాస్, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణలో విద్యార్థిని

వినూత్నంగా ప్రజల్లోకి పోలీసులు

- సామాజిక కార్యక్రమాల అమలుకు శ్రీకారం

8



దీక్షా శిబిరంలో నరేందర్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి హామీని నిలబెట్టుకోవాలి

8

గ్రామపంచాయతీ కార్మికుల నిరసన



ఇల్లంతకుంటలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



చందుర్తి మండల కేంద్రంలో..

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తు చేపట్టిన నిరసన గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండలశాఖ అధ్యక్షుడు వరుకోలు మల్లయ్య మాట్లాడుతు ప్రాణాలను ఫణంగా పెట్టి గ్రామపంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే త్వరలోనే విధులను బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చాతర్ల బాబు, ఉపాధ్యక్షుడు బిగుళ్ళ అశోక్, కోశాధికారి బత్తుల ఎల్లయ్య, సంఘ నాయకులు నాగయ్య, బాలయ్య, లక్ష్మి, జ్యోతి, గీత, స్వప్న, రవి, రాములు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమస్యల సాధనకు ఈ నెల 27, 28న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును ఎంపీడీవో సత్తయ్య అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రాజయ్య, నర్సయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, ప్రభాకర్, గోవర్ధన్, నర్సవ్వ, వజ్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య అన్నారు. మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలనే రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా చందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28 తేదీల్లో సమ్మె చేపడుతున్నామన్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మిక సంఘం నాయకులు వాసం కిరణ్ కుమార్, కొమ్ము చరణ్, లక్కే బాబు, మేడికల వినోద్, లక్ష్మీ, దేవవ్వ, వజ్రవ్వ పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం

వేములవాడ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకలమర్రి, నమిలిగుండుపల్లి , వట్టెంల మీదుగా కరీంనగర్ వెళ్లే బస్సును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా బస్సు సౌకర్యంలేక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమస్యను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి రూటులో బస్సు పునఃప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేమాల ప్రవీణ్, నాయకులు లింగబ్బ, పింగల్, తిరుపతి, బొడ్డు బాబు, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని నుంచి డబ్బులు అపహరణ

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతా నుంచి డ్రాచేసిన డబ్బులను లెక్కపెట్టి ఇస్తానని నమ్మబలికి వృద్ధుడి వద్ద నుంచి ఏడువేల రూపాయలు అపహరించిన ఘటన వేములవాడ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో గురువారం జరిగింది. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గుడిసె మాణిక్యం అనే వృద్ధుడు యూనియన్ బ్యాంక్‌లోని తన ఖాతాలో నుంచి రూ. 20 వేలు డ్రా చేశాడు. వృద్ధుడిని గమనించిన ఓ వ్యక్తి అతనికి మాయమాటలు చెప్పి డబ్బులు మళ్లీ లెక్కిస్తానని తీసుకుని డబ్బులు లెక్కిస్తున్నట్లు నటించి అందులోంచి ఏడు వేల రూపాయలు మాయం చేసి మిగతా సొమ్ము చేతిలో పెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. అనుమానం వచ్చిన వృద్ధుడు మళ్లీ డబ్బులు లెక్కించగా 13 వేల రూపాయలు మాత్రమే ఉండడంతో మోసపోయానని గ్రహించి విషయాన్ని బ్యాంక్ మేనేజర్‌కు తెలిపాడు. బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. డబ్బులు ఎత్తుకుని వెళ్లిన దొంగ సమీపంలోని ఓ వైన్ షాప్ దగ్గర ఉండడం గమనించిన బ్యాంక్ ఉద్యోగి రాజేష్ అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. చాకచక్యంగా దొంగను పట్టు కొని పోలీసులకు అప్పగించిన రాజేష్‌ను బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

మల్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్యాల కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ సెల్‌ఫోన్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ స్థానిక మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇళ్ల మధ్య సెల్‌టవర్‌తో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఈవో శ్రీకాంత్‌తో తమ ఆగ్రహం వెలిబుచ్చారు. పనులు నిలిపివేయనున్నట్లు ఈవో తెలుపడంతో మహిళలు వెనుదిరిగారు.

సమస్యలు పరిష్కరించరూ..

- రేషన్ డీలర్లకు అందని గౌరవ వేతనం
- సక్రమంగా జమకాని కమీషన్
- నెలంతా కష్టపడినా ఫలితం ఉండడం లేదని ఆవేదన





హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. నెల రోజులు కష్టపడితే ఏమీ మిగలడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు.

● మినీ సూపర్ మార్కెట్లుగా...

ఉమ్మడి రాష్ట్రంలో అమ్మహస్తం పథకం అమలు జరిగింది. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇలా తొమ్మిది నిత్యావసర వస్తువులు రేషన్ షాపు ల్లో ఇచ్చేవారు. ఇది డీలర్లకు కాస్త లాభసాటిగానే ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ ప్రభు త్వం వచ్చాక అమ్మహస్తం పథకం నిలిచిపోయింది. కేవలం రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమిత మయ్యాయి. తిరిగి నిత్యా వసరల విక్రయం జరి పేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మారిస్తే న్యాయం చేసినట్లు అవుతుందంటున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు ప్రతినెల క్రమంగా అందటం లేదు. రెండు, మూడు నెలలకు కమీషన్ డబ్బులు అకౌంట్లలో జమ అవుతున్నాయి. నెలవారీ డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల క్రమంగా డబ్బులు ఇవ్వాలనే డిమాండ్ సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డీలర్లు వాపోతున్నారు.

● నామమాత్రంగా కమీషన్

ఎంత కష్టం చేసినా చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేధన చెందుతున్నారు. అన్‌లోడింగ్ చార్జీలు సైతం తామే భరించడంవల్ల ఏమీ మిగలడం లేదుంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దుస్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలరు వంద క్వింటాళ్ల బియ్యం బస్తాలను తీసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తం రెండువేల రూపాయల వరకు భరించాల్సి వస్తోంది. వంద క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాల్‌కు 140రూపాయల చొప్పున 14వేల రూపాయల కమిషన్ డీలర్‌కు వస్తుంది. అందులో నుంచి షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ ఖర్చులు చెల్లిస్తే ఏమీ మిగలడ లేదని డీలర్లు చెబుతున్నారు. అన్ లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువ వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ భారాన్ని కూడా మోయాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షాపు రెన్యూవల్ శాశ్వత ప్రతి పాదికన జరగాలని, ప్రతి నెల 1వ తేదీ లోగానే బియ్యం సరఫరా చేయాలని, ప్రభుత్వం రేషన్ షాపుల కోసం భవనాలను నిర్మించి ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు.

● ప్రభుత్వం స్పందిస్తే సమస్యకు పరిష్కారం



డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్. రేషన్‌షాపు డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. మా సమస్యలపై ప్రభుత్వం మాన వతా దృక్పథంతో స్పందించాలి. గౌరవ వేతనం మూడు వేల రూపాయలు కల్పించాలి. డీలర్ మృతి చెందితే తక్షణమే ఆర్థిక సహాయంగా ప్రభుత్వం 30వేల రూపాయలు ఆ కుటుంబానికి అందించాలి. అన్‌లోడింగ్ ఖర్చులు ప్రభుత్వం భరిస్తే మాకు కాస్త వెసులు బాటు ఉంటుంది.

- సొల్లు అశోక్, మండల రేషన్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్

తన ఇంటికి దారి ఇవ్వాలని

సెల్‌టవర్ ఎక్కి నిరసన





సెల్‌టవర్ ఎక్కిన మల్లేష్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి దారి ఇవ్వడంలేదని ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలో పందిళ్లలో గురువారం జరిగింది. సమస్య పరిష్కరిస్తామని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ హామీతో కొండపర్తి మల్లేష్ సెల్‌టవర్ నుంచి కిందికి దిగాడు. తమ ఇంటికి వెళ్లడానికి తన అన్న దారి ఇవ్వడంలేదని మనస్తాపం చెందిన మల్లేష్ సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని మల్లేష్‌కి నచ్చచెప్పి కిందికి దించే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సమస్య పరిష్కరిస్తామని ఫోన్‌ద్వారా తెలపడంతో బాధితుడు మల్లేష్ టవర్ పైనుంచి కిందికి దిగాడు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా

- ఒకే నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు
- మూడు లారీల పట్టివేత

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. లారీలకు ఒకే నంబర్ ప్లేటుతో ఇసుకను తరలించడంపై నిఘా పెట్టారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. 24 గంటల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక ఇసుక లారీని పట్టుకొని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సిరిసిల్ల పట్టణం కలెక్టరేట్ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా లారీ నంబర్ టీజీ 23 0639కు బదులుగా టీజీ 23టీ 0456 అనే నంబర్ ప్లేట్లు అమర్చి అక్రమంగా ఇసుకను తరలిసున్నారని బహిర్గతమైంది. రెండు లారీల్లో ఒకే నంబర్ ప్లేట్‌పై ఇసుకను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా లారీ నంబర్ ప్లేట్లు మార్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ బుద్దుల రాజేందర్(30), లారీ యజమానులైన బోయిన్ పల్లి మండలంలోని నీలోజుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు, కొదురు పాక గ్రామానికి చెందిన రాకం స్వాతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కెకృష్ణ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మీస జగదీష్(ఫైల్)

సుల్తానాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లూజ్ వైర్లను సరిచేసే యత్నంలో ఓ యువకుడు విద్యుదాఘతానికి గురై మృతిచెందిన సంఘటన సుల్తానాబాద్ మండ లంలోని రేగడిమద్దికుంటలో చోటు చేసుకుంది. రామునిపల్లి గ్రామానికి చెందిన మీస చంద్రయ్య, లక్ష్మీ దంపతులు, కుమారుడు మీస జగదీష్‌లు తమ వ్యవసాయ క్షేత్రంలో కూర గాయలు సాగు చేసుకుంటున్నారు. గురువారం సమీప విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండగా వాటిని సరి చేసే క్రమంలో సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైరుకు తాకి జగదీష్(24) విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కిందపడిపోగా కుటుంబ సభ్యులు అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జంగిలి దేవేంద్ర (27) గురువారం ఇంట్లో భర్త పరశురాములు లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా మానకొండూర్ మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన దేవేంద్రకు ఎరడపల్లి గ్రామానికి చెందిన జంగిలి పరశురాములతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 14 నెలల కూతురు ఉంది. దేవేంద్ర మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు.

హుజూరాబాద్‌లో ..

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన గంధ రామక్క అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గందం రామక్క ఉంటున్న ఇంటిని కొండబత్తిని మురళి జప్తు చేస్తాడమోనన్న మనోవేదనకు గురై ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన భార్య మృతికి కొండ బత్తిని మురళి, అంకుసులే కారణమంటూ మృతురాలి భర్త సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన ఎనమిది మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవదర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్ వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని అనే ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వాహనాల చోరీ కేసులో ఏడాది జైలు

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగలించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఏడాది జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. వేములవాడ పట్టణానికి చిట్టిమల్ల అంజయ్య, జగిత్యాలకు చెందిన ఉబిది గంగస్వామి తమ ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని గత జూన్ నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన షైక్ మహబూబ్, బొప్పాపూర్‌కు చెందిన అనరసి కిష్టయ్య అనే నిందితులను పట్టుకొని రిమాండ్ తరలించామని సీఐ వివరించారు. విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జీ షీటు దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసును వాదించారని, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తులకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు.

జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ సరెండర్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జగిత్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ రాములును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి సూపరెండెంట్ రాములు ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరుకావడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు చేపట్టారు. జనరల్ ఆసుపత్రిలో 9 తొమ్మిది జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించగా, కేవలం మూడు సమావేశాలకు హాజరయ్యారని, ఆరు పర్యాయాలు జడ్జీ జనరల్ బాడీ సమావేశాలకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచడంలో నిర్లక్ష్యం వహించడం, మాతా శిశు కేంద్రంలో ఆహార పదార్థాల కాంట్రాక్టులో అవకతవకలకు పాల్పడడం, గత నెలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో సూపరింటెండెంట్ రాములు సెలవు మంజూరుకాకుండానే గైర్హాజరైనట్లు గుర్తించడం, నిజామాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో డీఎంఈకి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచండి

● కలెక్టర్ సత్యప్రసాద్



పెద్దాపూర్ గురుకులంలో పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో పాములు, పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మళ్లీ పాము కాటు కలకలం రేపడంతో విషయం తెలుసుకున్న కలెక్టర్ గురువారం పాఠశాలలో పర్యటించారు. బుధవారం రాత్రి గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఓంకారి అఖిల్ పాము కాటుకు గురికాగా మరో విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఇద్దరిని కోరుట్ల ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు కోరుట్ల పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ అస్వస్థతకు గురైన విద్యార్థులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం గురుకుల పరిసరాలు, విద్యార్థులు పడుకునే బెడ్‌లు, తరగదులు, మరుగుదొడ్లు క్షుణంగా ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు అధికారులతో కలిసి పరిశీలించారు. యశ్వంత్ పాము కాటుకు గురయ్యాడా లేదా ఏదైనా విషకీటకం కుట్టిందా అనేది మెడికల్ కాలేజి వారితో మాట్లాడి వివరాలను సేకరిస్తామన్నారు. కాగా వైద్యులు పరిశీలించి పాము కాదని నిర్ధారించి చికిత్స అందించారు. డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ వైద్యాధికారి అంజిత్‌రెడ్డిలు యశ్వంత్‌ను పరిశీలించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధికారుల వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ రాము లు, పోలీసు, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను మరో చోటికి తరలించండి

● జాతీయ రహదారిపై తల్లిదండ్రుల ఆందోళన

పెద్దాపూర్ గురుకుల కళాశాల, పాఠశాలను మరో చోటికి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. గురువారం గురుకుల సమీపం లోని జాతీయ రహదారిపై బైఠాయించి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని ఐదు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి పాఠశాలను మరో చోటికి తరలిస్తామని హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లమని బైఠాయించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు సంఘటన స్థలంకు చేరుకుని సర్ది చేప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. సంఘటన స్థలానికి అడిషనల్ కలెక్టర్ లత వచ్చి విద్యార్థుల తల్లిదండ్రులలతో కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ మాధవిలతను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకరోజు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన సమయంలో విద్యార్థులను ఆసుపత్రికి తరలించడంలో, విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యవహరించిన తీరు, జరిగిన ఘటనల గురించి ఉన్నతాధికారులకు తెలపడంలో విచారణ చేపట్టారు. గురుకుల ఆవరణలో పారిశుధ్య నిర్వహణలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే తెలుపుతూ సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని అధికారులు తెలిపారు.

పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థికి అస్వస్థత

మెట్‌పల్లి రూరల్/కోరుట్ల, డిసెంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి బోడ యశ్వంత్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. యశ్వంత్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం స్నానం చేస్తుండగా చేయి నొప్పిగా ఉందని అక్కడే ఉన్న తోటి విద్యార్థులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే పాఠశాల సిబ్బందికి తెలుపడంతో చికిత్స నిమిత్తం యశ్వంత్‌ను కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి యాంటీవీనమ్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం అందిస్తున్నారు.

● బుధవారం రాత్రి, గురువారం ఉదయం అస్వస్థతకు గురైన ఓంకార్ అకిల్, బోడ యశ్వంత్‌లు కోరుట్ల పట్టణంలో ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతుండగా కలెక్టర్ సత్యప్రసాద్ వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

మత్స్యకారుల వలకు చిక్కిన కొండచిలువ



అర్కండ్లలో వలలో చిక్కిన కొండచిలువ

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామ వాగులో మత్స్యకారులు గురువారం చేపల కోసం వేసిన వలలో కొండచిలువ చిక్కింది. ఈ సందర్భంగా చేపల కోసం మత్స్యకారులు వలలు వేసి బయటకు తీయగా అందులో కొండ చిలువ చిక్కుకొని ఉంది. దాంతో కొండచిలువను బయటకు తీసి తాడుతో లాగి సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో వదిలేశారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థిని మృతి



బొల్లి మహి(ఫైల్)

చిగురుమామిడి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూలు నుంచి తన అక్కతో కలసి ఇంటి వస్తున్న చెల్లెలు ఇంటి సమీపంలో పాల వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినది. చిగురుమామిడి ఎస్ఐ రాజేశ్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బొల్ల మహి(7) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతుంది. సాయంత్రం తన అక్క అమూల్యతో కలిసి స్కూలు నుంచి ఇంటికి వస్తుండా పాల వ్యాన్ వెనకనుంచి వచ్చి ఢీకొనడంతో మహి అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి కూతురుని పట్టుకొని విలపిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. మహి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

గోదావరిఖనిలో వైద్యుడి ఐపీ పిటిషన్

- ఇద్దరు వైద్యులతో పాటు 15మందికి నోటీసులు - అదే బాటలో నలుగురు వ్యాపారులు

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ప్రముఖ వైద్యుడు ఐపీ పిటీషన్ దాఖలు చేసినట్టు సమాచారం. ఇద్దరు వైద్యులతో పాటు మొత్తం 15మందికి నోటీసులు పంపారు. గోదావరిఖనికి చెందిన ఒక కాంట్రాక్టర్, పలువురు వ్యాపారులు సదరు వైద్యుడితో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఐపీ నోటీసులు కలకలం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యవర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా గోదావరిఖనికి చెందిన పలువురు వ్యాపారులు కూడా ఇదే బాటలో ఉన్నట్టు తెలుస్తున్నది. కొందరు పిటిషన్లు దాఖలు చేయగా మరో నలుగురు పిటిషన్లు వేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామపంచాయితీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ (25) అనే యువకుడు ఆన్‌లైన్‌లో క్రిమిసంహారక మందును తెప్పించుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన రెడ్డవేని ప్రశాంత్ అనే యువకుడు కొద్ది సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లగా ఆపరేషన్ చేసినా తరుచూ కడుపునొప్పి వస్తుండేది. ప్రశాంత్ ఇటీవల దేశంలోని పలు జ్యోతిర్లింగాలను దర్శించుకొని ఇంటికి వచ్చాడు. గ్రామంలోని వారందిరికీ ఏ వస్తువులు కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్‌చేసే ప్రశాంత్ క్రిమిసంహారక మందును కూడా బుక్ చేశాడు. ఈ నెల 13న అర్ధరాత్రి వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

వైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన అనవేన కృష్ణమూర్తి(65) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కృష్ణమూర్తి భార్య క్యాన్సర్‌తో 13 ఏళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. పెయింటింగ్ వర్క్ చేసే కృష్ణమూర్తి మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు మద్యం మానివేయాలని మందలించారు. ఒంటరిగా ఉంటున్న కృష్ణమూర్తి మానసికంగా కుంగిపోయాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఇంటి పైకప్పు రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సంపత్‌కుమార్ తండ్రి కోసం ఇంటికి వచ్చి చూడగా ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సంపత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



నర్సయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త దొమ్మాటి నర్సయ్య(45) ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో జరిగింది. నర్సయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 10న మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న నర్సయ్యను భార్య పద్మ మందలించింది. మనస్తాపం చెందిన నర్సయ్య గదిలోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని సాయినగర్‌లో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు చొరబడి వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంగారి సదానందం బుధవారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన 20 వేల నగదుతో పాటు 40 తులాల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసెంబ్లీలో మన నేతలు

ప్రాజెక్టుల్లో నీటిని నింపండి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాజెక్టుల్లో ముందస్తుగా నీటిని నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టులకు ఈనెల ఆఖరు వరకు సాగునీరు అందించాలన్నారు. తద్వారా నియోజకవర్గంలోని మల్కపేట, ఫాజుల్‌నగర్, చందుర్తి, జోగాపూర్ చెరువులను నీటితో నింపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్యాకేజ్-9లోని మల్కపేట రిజర్వాయర్‌లో ఇదివరకే ఒక్క టీఎంసీ నీరు ఉందని, మరో టీఎంసీ నీటిని నింపే ప్రక్రియ చేపట్టాలన్నారు. తద్వారా వేములవాడ నియోజకవర్గంలోని రైతాంగానికి లబ్ధి చేకూర్చాలని కోరారు. కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతున్నాయని, కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభం కావాల్సి ఉందని, ఇందుకోసం ఇటీవల జిల్లా కలెక్టర్ భూ సేకరణకు పబ్లిక్ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. కుడి, ఎడమ కాలువల నష్టపరిహారం చెల్లించి, బొమ్మెన ప్రాజెక్టుకు నిధులను విడుదల చేయాల్సిందిగా మంత్రిని కోరారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ నీటితో నింపి, నష్టపరిహారం కోసం నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

దళితుల అసైన్డ్ భూములను అప్పగించాలి

- ధరణి సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



కరీంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో హరితహారం, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటికల కోసం దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను తీసుకుందని, తిరిగి ఆ భూములను వారికి పంపిణీ చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పేద దళితులకు కేటాయించిన భూములను ప్రజా అవసరాల పేరుతో ప్రభుత్వం తీసుకోవడంతో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. దళితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం స్పందించాలని కోరారు. మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి రైతులకు ధరణిలో జరిగిన అన్యాయాన్ని సవరించాలన్నారు. చొక్కారావుపల్లిలో రైతులు 1958 నుంచి పట్టాలు కలిగి ఉన్నారన్నారు. రైతులకు సంబంధించి 163 ఎకరాల పట్టా భూములు కాగా, ధరణిలో 153 ఎకరాలను మాత్రమే చూపించారన్నారు. ధరణిలో జరిగిన తప్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారని అసెంబ్లీలో వివరించారు. ప్రభుత్వం ధరణిలో జరిగిన తప్పులను వెంటనే సవరించి చొక్కారావుపల్లె రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రిని కవ్వంపల్లి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తున్న భూమాతను ధరణిలా తప్పులతో కాకుండా చూడాలని కవ్వంపల్లి విన్నవించారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు బిలేని కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యనిర్వాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పీఆర్టీయూ ఆవిర్భవించిందన్నారు. ఈనెల 31లోపు 317 జీవోకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, పరస్పర బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి, ముస్కు తిరుపతిరెడ్డి, జాలి రాఘవరెడ్డి, జాలి మహేందర్‌రెడ్డి, పాకాల ప్రభాకర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూడా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి నియమించకపోవడంతో విద్యారంగ సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుందని ప్రజా విజయోత్సవాలను జరుపుకోవడం కాదని, విద్యాశాఖ మంత్రిని నియమించి రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని పెంచిన మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మాల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, కుర్ర రాకేష్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై కేసు నమోదు

ఓదెల, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులోని మల్లికార్జున రైస్ మిల్లుపై గురువారం కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని డిటిసిఎస్, సిఎస్ఐ అధికారులు తెలిపారు. రైస్ మిల్లులో డీటీసీఎస్ సీఎస్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ప్రభుత్వం ఇచ్చిన వరి ధాన్యం 33,063.81 బదులుగా మిల్లు యజమాన్యం ఇవ్వవలసిన సీఎంఆర్ ధాన్యం 22,152.81 క్వింటాళ్లు కాగా, ఇందులో 32,636.31 క్వింటాళ్ల ధాన్యం తేడా వచ్చిందని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ కస్టమ్స్ మిల్లింగ్ ఆర్డర్ 2015 ప్రకారంగా ఓదెల మల్లికార్జున రా రైస్ మిల్ పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

గృహ నిర్మాణదారులకు ఊరట..!

● తగ్గిన సిమెంట్, ఐరన్ ధరలు



సిమెంట్ బస్తాలు | ఐరన్ | హుజూరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు

హుజూరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టుకోవాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో భారం. ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది గృహ నిర్మాణాలను వాయిదా వేస్తూ వస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు మొదలు పెట్టాలంటే భయపడుతున్నారు. కూలీ రేట్లు, నిర్మాణ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత్త గృహనిర్మాణం చేసుకునేవారికి అనుకూలమైన సమయంగా చెపుతున్నారు. ఎందుకంటే సిమెంట్, ఐరన్ ధరలు భారీగా తగ్గాయి. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలలో గృహ నిర్మాణాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసిన చాలా మంది నిర్మాణంపై వేచి చూస్తున్నారు. ఇల్లు నిర్మాణం చేయాలంటే సిమెంట్, ఐరన్ ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. మూడు నెలల క్రితం సిమెంట్ బస్తాకు రూ. 360-370 వరకు ధర ఉండగా, ఐరన్ క్వింటాల్‌కు రూ. 7,500 ధర ఉండేది. ఈ ధరలను చూసి చాలా మంది నిర్మాణాలు చేపట్టాలంటే జంకేవారు. ప్రస్తుతం సిమెంట్ బస్తాకు 50రూపాయలు, ఐరన్ క్వింటాల్‌కు 600ల నుంచి 700 రూపాయల వరకు దిగింది. దీంతో గృహ నిర్మాణాలు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరలు మరో నెల రోజుల్లో పెరుగుతాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇంటికి వేసుకునే రంగుల ధరలు కూడా తగ్గినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. డిసెంబరు నుంచి జూన్ వరకు నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు తగ్గడంతో ఇళ్ల కట్టుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపే అవకాశం ఉంది.

● సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి.



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను. గతంలో ఎక్కువ ధరలు ఉండ డంతో నిర్మాణం చేపట్టలేదు. సిమెంట్ బస్తాకు రూ. 50, క్వింటాల్ ఐరన్‌కు రూ. 700 ధరలు తగ్గాయి. మళ్లీ ధరలు పెరుగుతాయనే ఉద్దేశ్యంతో ఇల్లు నిర్మాణం చేపడుతున్నాను.

- పోగు శ్రీనివాస్, గృహ నిర్మాణదారుడు, హుజూరాబాద్

● ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి



సిమెంట్, ఐరన్ ధరలు తగ్గాయి. మూడు నెలల క్రితం సిమెంట్, ఐరన్ ధరలు ఎక్కువగా ఉండేది. అధిక ధరలు ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. ఇప్పుడిప్పుడే సిమెంట్, ఐరన్ ధరలు తగ్గడంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

- దండ శ్రీనివాస్, సిమెంట్ వ్యాపారి, హుజూరాబాద్

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధి కార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్-2024 వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో శనివారం నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి మహిళ, పురుషుల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల జట్లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల ఎంపిక చేసి ఉమ్మడి కరీంనగర్ జట్టు నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాల యం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ధర్మపురిలోని ఎస్ఎల్ఎన్ఎస్ఎ కళాశాలలో ఒకరు, జగిత్యాల నలంద డిగ్రీ కళాశాల జగిత్యాలలో మరొకరు డీబార్ అయ్యారన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల సెంటర్లను గురువారం వీసీ ఉమేష్ కుమార్ సందర్శించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది ఓట్లు

● వందల సంఖ్యలో డబుల్, ఆపై ఎంట్రీలు ● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో ఒక్కరికే ఎనిమిది చోట్ల ఓటు హక్కు కల్పించారని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వందల సంఖ్యలో ఒక్కో వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓటు హక్కు కల్పిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రూపొందించారన్నారు. ఓటరు జాబితాను ఆధార్‌కార్డుతో లింక్ చేస్తే పారదర్శకంగా ఉండేదని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న కొందరు అభ్యర్థులు వేలల్లో ఓటరు నమోదు చేయించామని చెప్పడంతో తాను ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించగా 24 గంటల్లో 200కు పైగా డబుల్, ట్రిపుల్ నుంచి ఎనిమిది చోట్ల ఒకే అభ్యర్థి పేరు ఉన్నట్లు గుర్తించానని చెప్పారు. జాబితాలో శ్రీనివాస్, సంపత్ లాంటి పేర్లు ఎక్కువగా ఉండగా, వారి తండ్రిపేరు, వయసు, చిరునామా, ఆధార్ నంబర్ ఒకటే ఉందన్నారు. ఒకే వ్యక్తికి ఇన్ని చోట్ల ఎలా ఓటు వచ్చిందని ఆశ్చర్యం వేసి కలెక్టర్ దృష్టికి, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకొని ఆధారాలను జత చేసి ఫిర్యాదు కూడా చేస్తున్నానని రవీందర్‌సింగ్ తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా జనవరి 1న ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా వెల్లడించనున్నందున ఇప్పటి వరకు రూపొందించిన జాబితాను పునః పరిశీలన చేసి ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడాలని రవీందర్‌సింగ్ కోరారు. ఈసమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన అఖిల్, మధుసూదన్

వేములవాడ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రహారం డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న అఖిల్, మధుసూదన్ అనే ఇద్దరు విద్యార్థులు శాతవాహన విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కేరళలో నిర్వహించే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు.

రామగుండంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పర్యటన



గోదావరి తీరంలో పరిశీలన జరుపుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

కోల్‌సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందం గురువారం రామగుండం ప్రాంతంలో పర్యటించింది. గత రెండేళ్లుగా గోదావరి వరద ముంపునకు గురైన మల్యాపూర్, సప్తగిరికాలనీ, హెడ్‌వర్క్స్ ఏరియా, పుష్కరఘాట్లు తదితర ప్రాంతాలను పర్యటించింది. రామగుండం రెవెన్యూ అధికారులు వరద ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి చూపారు. గోదావరినదికి రెండేళ్ల క్రితం భారీ వరదలు వచ్చి సింగరేణి హెడ్‌వర్క్స్ వద్ద ఉద్యోగులు చిక్కుకున్న సమయంలో ప్రమాదకరమైన వరద సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వారిని రక్షించింది. దీంతో వరద ముంపు ఏ విధంగా గురవుతుందని, గోదావరి వరద నీరు ఎలా చొచ్చుకు వస్తుందనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం సప్తగిరికాలనీలో వరదలు, ఇతర విపత్తులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన సహాయ చర్యలపై నగరపాలక సంస్థ పారిశుధ్య, తాగునీటి సరఫరా తదితర విభాగాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండెంట్ ఐఎన్ఎస్ఎఫ్ బబ్లు బిశ్వాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేషన్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, ఈఈ రామన్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



డీటీసీని కలిసిన ఏఎంవీలు

డీటీసీని కలిసిన నూతన ఏఎంవీఐలు

తిమ్మాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికై రాష్ట్ర రవాణా శాఖలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నూతనంగా విధులు చేపట్టిన ఆరుగురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు గురువారం మండలంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ జిల్లాకు హరిత యాదవ్, పెద్దపల్లి జిల్లాకు వంశీకృష్ణ, నిఖిల్ కుమార్, రామగుండం ప్రదీప్ సాగర్, రాజన్న సిరిసిల్లకు పృథ్వీరాజ్ వర్మ, జగిత్యాల జిల్లాకు షేక్ రియాజ్‌లను నియమిస్తూ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కే.సురేంద్ర మోహన్ ఉత్తర్వులు జారీచేయగా వారు ఈ నెల 16న ఉద్యోగాల్లో చేరారు. ఈ సందర్భంగా గురువారం డీటీసీ పురుషోత్తంను మర్యాద పూర్వకంగా కలిశారు.

పేరిణి, కూచిపూడిలో ఖని కళాకారుడి ప్రతిభ

● జాతీయస్థాయిలో ప్రదర్శనలు ● పలు అవార్డులు సొంతం



సిలికానాంధ్ర కూచిపూడి నృత్య బృందంలో నాగరాజు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కథ కళాకారుడైన తండ్రి స్ఫూర్తితో తాను కూడా కళాకారుడిని కావాలనుకున్నాడు.. తల్లిదండ్రులు, గురువు ప్రోత్సాహంతో పేరిణి, కూచిపూడి నృత్య కళాకారుడిగా రాణిస్తూ జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చాడు.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సప్తగిరికాలనీకి చెందిన కొట్టె నాగరాజు పేరిణి, కూచిపూడి నృత్య కళల్లో తన అద్భుత ప్రదర్శనతో ప్రసంశలందుకుంటున్నాడు. నాగరాజు తల్లి లక్ష్మి, తండ్రి రాములు. ఒగ్గుకథ కళాకారుడిగా రాములు సుపరిచితుడు. తండ్రి ఒగ్గుకథ కళాకారుడు కావడంతో నాగరాజుకు కళలపై ఆసక్తి పెరిగింది. దీంతో తల్లిదండ్రులు నాట్యగురువు జక్కు కృష్ణ వద్ద శిక్షణ ఇప్పించారు. అనంతరం నాగరాజు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో పేరిణి, కూచిపూడి నృత్యంలో డిప్లొమా పూర్తిచేశారు. నాగరాజు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు అందుకున్నారు. 2012 సంవత్సరంలో సిలికాన్ ఆంధ్ర నిర్వహించిన కూచిపూడి బృంద నృత్యంలో పాల్గొని గిన్నిస్‌వరల్డ్ రికార్డు అందుకున్నారు. నాగరాజు ఇప్పటి వరకు 200పైగా ప్రదర్శనలు ఇచ్చారు. నాట్య ప్రవీణ, నాట్యరత్న, నాట్య కళాబ్రహ్మ అవార్డులు అందుకున్నారు. తాను నేర్చుకున్న విద్యను పదిమందికి శిక్షణ ఇవ్వాలన్న సంకల్పంతో స్నేహ ఆర్ట్స్ అకాడమీ, రుద్ర డ్యాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి పలువురికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు.

● పేరిణి నాట్యాన్ని అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించాలి : కొట్టె నాగరాజు



తెలంగాణ రాష్ట్ర కళానృత్యం పేరిణి నాట్యాన్ని అందరికి తెలియజేసి చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దాలని అకాడమీ ఏర్పాటు చేశా. పేరిణి శివతాండవాన్ని, కూచిపూడి నృత్యం అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని కోరిక.

కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు

శంకరపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ పరిశీలకులు సత్యనారాయణ సమక్షంలో 8నెలల హుండీ లెక్కించగా, రూ. 1,44,144 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎంపిక



రాహుల్

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మామిడి రాహుల్ ఎంపికయ్యాడు. జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌తో పాటు మరుసటి రోజు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక నివాసంలో నిర్వహించే ఎట్‌హోం కార్యక్ర మంలో రాహుల్ పాల్గొననున్నాడు. గురు వారం కళాశాల ఆవరణలో జరిగిన కార్య క్రమంలో రాహుల్‌ను ప్రిన్సిపాల్ జైశంకర్ ఓజా, ఎన్ఎస్ఎస్ పీవో సాంబశివరావు, డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ కిరణ్మయిఅభినందించారు.

న్యూస్ బాక్స్

యువతకు అండగా ఉంటా

వేములవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో జరిగిన వేములవాడ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే నిరుద్యోగ యువతీయువకులకు వెన్నుదన్నుగా నిలుస్తానని చెప్పారు. వేములవాడలో ఆధునిక గ్రంథాలయం, క్రీడా మైదానం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. యువత విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు కూడా దక్కుతాయని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం ఉమా బాలచందర్, విద్యాసంస్థల కరస్పాండెంట్లు జితేందర్‌రావు, గుండ శ్రీకాంత్, శ్యామ్‌సుందర్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టు



చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో మాల మహానాడు సంఘం నాయకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారం మేరకు మాలమహానాడు నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో మాలమహానాడు మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ మామిడి సంజీవ్, మాజీ ఎంపీటీసీ బట్టి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు ఆధ్వర్యంలో తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్లకుండా ఎల్లారెడ్డిపేట పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన ఆ సంఘం నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీసుల అక్రమ అరెస్టులను నాయకులు ఖండించారు. అరెస్టయిన వారిలో మాల సంఘం నాయకులు రాజ్‌కుమార్, రామచంద్రం, సందీప్, ఎల్లం ఉన్నారు

చందుర్తి(ఆంధ్రజ్యోతి): మండలంలో అరెస్ట్ అయిన వారిలో జాతీయ మాల మహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కమలాకర్, చందుర్తి మండల ఉపాధ్యక్షుడు ఆసినిపర్తి ఏసుకుమార్, సంఘం నాయకులు కాపిల్ల స్వామి ఉన్నారు.

వినూత్నంగా ప్రజల్లోకి పోలీసులు

- సామాజిక కార్యక్రమాల అమలుకు శ్రీకారం
- జిల్లాలో నేరాల నియంత్రణలో ముందడుగు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వినత్నూంగా ప్రజల్లోకి వెళ్లేందుకు పోలీస్‌శాఖ దృష్టి పెట్టింది. సరికొత్త కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో నేరాల నియంత్రణలో ముందడుగు వేస్తోంది. ఎస్పీ అఖిల్ మహాజన్ అనేక సామాజిక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. జిల్లావ్యాప్తంగా వినూత్న కార్యక్రమాల ద్వారా పోలీస్‌శాఖ సత్ఫలితాలను సాధిస్తోంది.



యువకులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న ఎస్పీ



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న పోలీసులు

● రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్

జిల్లాలో ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలు, పాఠశాలల్లో ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటుచేశారు. ఈ కమిటీల ద్వారా గ్రామస్థాయిలో దాదాపు 1500మంది యువతకు సీపీఆర్, ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా రహదారుల వెంట ఉన్న దుకాణాలు, పెట్రోల్ పంపులు, మెకానిక్ దుకాణాలు, తదితర 400మంది చిరువ్యాపారులను గుర్తించి ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. శిక్షణతో పాటు ప్రథమ చికిత్స కిట్‌లను అందజేశారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు ప్రధాన చౌరస్తాల వద్ద త్రీడీ యానిమేటెడ్ పెట్రోకార్‌లను ఏర్పరిచారు. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైన్ బోర్డులు, రబ్బర్ స్ట్రీప్స్, అప్రోచ్ రోడ్స్ వద్ద స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులైన జిల్లెల్ల, గంభీరావుపేట పెద్దమ్మ స్టేజీ, రుద్రంగి, కొదురుపాకల వద్ద ఆటో మెటిక్ సీసీ కెమెరాలను అమర్చారు.

● జాబ్ మేళా, హెల్త్‌క్యాంప్‌లు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీస్‌శాఖ జాబ్‌మేళా, డ్రైవింగ్ లైసెన్స్ మేళా, హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేస్తోంది. యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు వివిధ కంపెనీలతో జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించడంలో తోడ్పడుతుంది. జాబ్ మేళాలలకు దాదాపు ఎనిమిది వేల మంది నిరుద్యోగులు హాజరైతే 1100 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగఅవకాశాలు కల్పించారు. జిల్లాలోని 25మంది నిరుద్యోగ యువతీయువకులకు సీసీటీవీ స్కిల్స్ ట్రైనింగ్‌లో భాగంగా మూడు నెలల ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. గ్రామీణ యువతీ, యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి నిర్ణీత ఆన్‌లైన్ ఫీజుతో లైసెన్స్‌లు అందజేశారు. జిల్లాలోని వీర్నపల్లి, రుద్రంగి మండలాల ప్రజలకు మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించారు.

● క్రీడల నిర్వహణకు 'దోస్తీ మీట్'

జిల్లాలోని గ్రామీణ యువత వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు వారి దృష్టిని క్రీడల వైపు మళ్లించేందుకు దోస్తీ మీట్‌లు నిర్వహించారు. దోస్తీ మీట్‌తో పాటు వేసవి క్యాంపులు ఏర్పరిచి యువతను క్రీడలవైపు దృష్టి మళ్లించారు. దోస్తీ మీట్‌లో భాగంగా మండల, జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంత యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు.

● మహిళల భరోసాకు 'ఆపరేషన్ జ్వాల'

జిల్లాలో మహిళలు, బాలికలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ఆపరేషన్ జ్వాల కార్యక్రమం నిర్వహిస్తోంది. మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకట్ట వేసేందుకు షీటీం బృందాలను ఏర్పరిచి మహిళా చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ జ్వాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 2600 మంది విద్యార్థునులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై కరాటే శిక్షణ ఇచ్చారు. షీటీం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. పోలీస్ అక్క పేరుతో అన్ని విద్యాసంస్థల్లో ఫోన్ నంబర్లు పెడుతారు. జిల్లాలో అకతాయిల ఆటకట్టించేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా పోలీస్‌శాఖ ప్రయత్నిస్తోంది.

● ఫోన్ల రికవరీలో ముందంజ..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఫోన్‌ల రికవరీలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో వివిధ సందర్భాల్లో దొంగిలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా 812 మొబైల్స్‌ను గుర్తించి 698 ఫోన్లను బాధితులకు అప్పగించారు. జిల్లాలో దాదాపు 85 శాతం ఫోన్స్ రికవరి చేసి స్టేట్ ఫస్ట్‌గా నిలిపారు.

● ఖాకీ కిడ్స్ కార్యక్రమం

జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలపై పెద్దలకు అవగాహన కల్పించేందుకు ఖాకీ కిడ్స్ అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. చిన్నపిల్లల నుంచే వారి పెద్దలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు కళాశాలలు, పాఠశాలల్లో సదస్సులు ఏర్పరిచడమే ఖాకీ కిడ్స్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

● డీ- అడిక్షన్ సెంటర్లు, యాంటీ డ్రగ్ క్లబ్స్

జిల్లాలో యువత మత్తు పదార్థాల బారినపడకుండా ఉండేందుకు యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పరిచారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల సహాయంతో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పరిచి మాదకద్రవ్యాలు, గంజాయి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. మత్తుపదార్థాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి అవగాహన పెంపొందిస్తున్నారు. మాదకద్రవ్యాల నివారణ కోసం జిల్లాలో 5కె రన్ నిర్వహించి విజేతలకు సైకిళ్లు అందజేశారు. మరోవైపు డ్రగ్స్ బారిన పడిన వ్యక్తులకు వైద్యసహాయం అందించేందుకు సిరిసిల్లలో డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పరిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీని నిలబెట్టుకోవాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలేనిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యూలర్ చేసి ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పలువురు నాయకులు కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలేనిరహార దీక్షలు గురువారంతో 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో ఉద్యోగులు కూర్చోగా శిబిరాన్ని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సదానందం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 14 విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. సాధ్యమైనంత త్వరగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని కోరారు. దీక్షల్లో జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకటరమణ, పద్మ, నరేంద ర్, శ్రీనివాస్, దేవరాజ్, ఎండి సలీం, వెంకటేష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చొని సంఘీభావం తెలుపుతున్న విశారదన్ మాహారాజ్

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

తంగళ్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తనిఖీ చేశారు. యాసంగి పంటకు సరిపడేంత భాస్వరం, పొటాషియం, నత్రజని తదితర ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి సంజీవ్, వ్యవసాయ విస్తరణ అధికారులు కరుణాకర్, సంతోష్, గౌతమి ఉన్నారు.

ఎంపీడీవోపై విచారణ చేపట్టాలి

గంభీరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత మంగళి చంద్రమౌళి కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులకు దుస్తుల కొనుగోలు కోసం పంచాయతీ జీరో అకౌంట్ నుంచి లక్షా 93 వేల రూపాయలను అధికారులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాలుగు నెలల నుంచి ఎన్నిసార్లు అడిగినా దుస్తులు ఇవ్వడం లేదని చంద్రమౌళి కలెక్టర్‌కు వివరించారు. దుస్తులతో పాటు సబ్బులు, చేతి తొడుగులు ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకు ఇవ్వకుండా ఐదు నెలలుగా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. సత్వరమే గ్రామపంచాయతీ వ్య వహారంపై విచారణకు ఆదేశించాలని కోరారు. ఎంపీడీవో స్థానికంగా ఉండకపోవడమే కాకుండా సమయానికి రాకుండా విధి నిర్వహణలో పూర్తి స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీవో తీరుపై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు కరీంనగర్ అధికారులకు చంద్రమౌళి ఫిర్యాదు చేశారు.

విద్యార్థినికి అభినందన

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా స్థాయి జీవశాస్త్రం, గణితశాస్త్రం ప్రతిభా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని మాజీ సర్పంచ్ గురువారం అభినందించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని చొక్కి భవితను ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట తాజా, మాజీ సర్పంచ్ ముక్క శంకర్ శాలువతో సన్మానించారు. విద్యార్థిని పట్టుదలతో తన ప్రతిభను చూపిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి







వేములవాడలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు, సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు, గంభీరావుపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

వేములవాడ/గంభీరావుపేట/ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని అంబేద్కర్, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో దళిత సంఘాల నేతలు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను అవమానించేలా హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడటం సరైనది కాదన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జింక శ్రీధర్, మూలె కిషోర్, బత్తుల కమలాకర్, లింగంపల్లి కిరణ్, మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు మాల్యాల రాజవీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్ర, బీఆర్ఎస్ గంభీరావుపేల మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకుడు పసుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

● రాజ్యాంగాన్ని అవమానించిన అమిత్ షా

సిరిసిల్ల టౌన్ (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేద్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని రాజ్యసభలో అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద అమిత్ షా చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుడికాల రవికుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ ఖాజామొయినొద్దిన్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై మాట్లాడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

● మనువాద ఆలోచనలు మానుకోవాలి..

సిరిసిల్ల రూరల్(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షా మనువాద ఆలోచనలు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్లలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని రచించి మార్గదర్శిగా నిలిచిన అంబేద్కర్ భారతీయ సమాజానికి ఆరాధ్యుడన్నారు. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా కేంద్రమంత్రి అమిత్‌షా మాటలను సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

● రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం దాడి..

సిరిసిల్ల టౌన్ (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా భారత రాజ్యాంగం, బీఆర్ అంబేద్కర్‌పై దాడి చేస్తూనే ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమిత్ షా రాజ్యాంగాన్ని, అంబే ద్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

'మన ఇసుక వాహనం' పాలసీపై అవగాహన

కథలాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీలో భాగంగా మన ఇసుక వాహనం కార్యక్రమంపై గురువారం తహసీల్దార్ వినోద్ ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించారు. రైతువేదికలో యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇసుక తరలించే యజమానులు కమర్షియర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న తమ ట్రాక్టర్ల వివరాలను 10 వేల రూపాయలు చెల్లించి మీ-సేవలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సిరికొండలో ఇసుక రీచ్ ఏర్పాటుకు నిర్ణయించిన నేపథ్యంలో ట్రాక్టర్ యజమానులు అక్రమంగా ఇసుక తరలించవద్దన్నారు. తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో మాదిరిగా డీడీలు చెల్లించే విధానం అమలు చేయాలని తహసీల్దార్‌కు ట్రాక్టర్ యజమానులు వినతి పత్రం అందించారు.

పట్టణంలో పందుల స్వైర విహారం



అశోక్‌నగర్‌లో పందుల గుంపు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని కొన్ని వార్డుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకా శముందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 25, 37, 38 వార్డుల్లో ఎక్కడ చూసినా పందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పట్టించుకోవాల్సిన మున్సిపల్ పాలక వర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని స్థానిక వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా పట్టణంలో కొద్దిమేర పందుల సమస్య లేదని, ఇటీవల మళ్లీ తీవ్రమైందని పేర్కొంటున్నారు. వార్డుల్లో తిరుగుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం, సంబంధిత అధికారులు పట్టించుకోవాలని, పందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పందుల బెడద తగ్గించాలి



- బూర మధు, సిరిసిల్ల

వార్డులో పందుల బెడదను నివారిం చాలి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇటీవల కాలంలో వార్డుల్లో పందుల ఎక్కువగా కనిపి స్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి.

అధికారులు స్పందించాలి



- చొప్పదండి శ్రీనివాస్, సిరిసిల్ల

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న పందులతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వెంటనే అధికారులు స్పందించాలి. పందులను ఇక్కడి నుంచి తరలించాలి. వెంటనే చర్యలు చేపట్టాలి.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

- జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వేణు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వేణు

ఇల్లంతకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను వెంటనే ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడుతామని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వినతి మేరకు కేసీఆర్ ఫోర్‌లైన్ రోడ్డుకు 82 కోట్ల రూపాయలను కేటాయించారని పేర్కొన్నారు. ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె మీదుగా కిష్టాపూర్ వరకు ఫోర్ లైన్ రోడ్డువేయడానికి రైతులకు పరిహారం అందించడానికి ఏర్పాట్లు కూడా పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే అన్నపూర్ణ, మిడ్ మానేరు ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా మారే అవకాశం ఉండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు పనులను విస్మరించిందని పేర్కొన్నారు. రోడ్డు పనులు పూర్తి చేయించవలసిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బీటీ రోడ్డు రెన్యూవల్ చేయించారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పదిరోజుల్లో పనులు ప్రారంభించాలన్నారు. లేకుంటే ప్రజల మద్దతుతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కేతిరెడ్డి వెంకటనర్సింహ్మారెడ్డి, వడియాల సత్యనారాయణరెడ్డి, కోలపురి కార్తీక్, రెడ్డి ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌కు బీఆర్ఎస్ జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ ఉదయం సాయంత్ర పాఠశాల, కళాశాలల సమయాలకు అనుకూలంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బస్సు స్టేషన్‌లో గ్రామీణ విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. ఇప్పటికైన విద్యార్థుల సమయాపాలనకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అదనంగా నడిపించాలని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించామన్నారు. డీపో మేనేజర్ అశోక్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, అనిల్‌గౌడ్, వినయ్, శ్రీకాంత్, శ్రీనివాస్, దేవరాజు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తంగళ్లపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా పూర్మాని రామలింగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దుబ్బాక రాజు, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి రాజశేఖర్, కోశాధికారిగా గడగోని సాగర్, సహాయ కార్యదర్శిగా గ్యాదనవేని మధు, సాంస్కృతిక కార్యదర్శిగా రెడ్డిమల్ల దేవరాజు, ముఖ్య సలహాదారులుగా సామల గట్టు, వెంగల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు జలగం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోర శ్రీకాంత్ మాట్లాడుతూ నూతనంగా పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కృషి చేస్తామన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మంత్రి పాటి రాజం సేవలు మరువలేనివి

గంభీరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేటకు చెందిన దివంగత మాజీ మంత్రి పాటి రాజం సేవలు మరువలేనివని పలువురు నాయకులు కొనియాడారు. పాటి రాజం వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ నీటి పారుదల శాఖ, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ ఈవో లక్ష్మణ్, పాటి రాజం విగ్రహం కో కన్వీనర్ మల్యాల రాజవీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, నాయకులు గంద్యాడపు రాజు, ఎడబోయిన ప్రభాకర్, ఎగదండి స్వామి, ఉపేంద్ర, దోసల శంకర్, బాబురావు, లక్ష్మీన్నారాయణ, బాలకృష్ణ, బండ రమేష్, మల్లయ్య, అక్కపల్లి బాలయ్య, వేశాల వెంకటి, నాంపెల్లి, బాబు, రాజు, నరేష్ తదితరులు ఉన్నారు.

లక్ష డప్పులు, వెయ్యి గొంతులతో భారీ కవాతు

- ప్రజా గాయకుడు రామంచ భరత్



మాట్లాడుతున్న ప్రజా గాయకుడు రామంచ భరత్, నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు వెయ్యి గొంతుల కళాకారులతో ఈ నెల 27 నుంచి జనవరి 27 వరకు భారీ ప్రదర్శన, కవాతులో మాదిగలంతా పాల్గొనాలని ప్రజా గాయకుడు రామంచ భరత్ పిలుపినిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ముఖ్య నా యకులతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామంచ భరత్ మాట్లాడారు. దేశంలో అన్నివర్గాల ప్రజలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపాయని అన్నారు. ఎస్సీల్లో ఉన్న 59 కులాల్లో కేవలం ఒక కులం మాత్రమే వర్గీకరణకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. ఉద్యమాల్లో, రాజకీయ పార్టీల గెలుపోటముల్లో మాదిగ కళాకారుల పాత్ర ఉందన్నారు. మొదటి సారిగా తమ హక్కుల సాధన కోసం డప్పులు కొట్టబోతున్నామన్నారు. ఈ నెల 27 నుంచి జనవరి 27 వరకు లక్ష డప్పులు వెయ్యి గొంతుల కళాకారుల కవాతు కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమం లో ఎమ్మెస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు గజ్జెల అశోక్, ముక్కెర సంపత్‌కుమార్, గుండా థామస్ యెలగందుల బిక్షపతి, కళాకారులు ఆకునూరి దేవయ్య, పూడూరి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపిక

గొల్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎ వర్షిణి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటిల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 28న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటిల్లో వర్షిణి పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ సుంకరి రవి తెలిపారు. వర్షిణిని ప్రిన్సిపాల్ రవి అభినందించారు.